క్లుప్తంగా

రోడ్డును బాగుచేయాలి



సంతకాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగర శివారులోని జొహరాపురం నుంచి వెంకయపల్లె వరకు ఛిద్రమైన రోడ్డు స్థానంలో వెంటనే కొత్త రోడ్డును నిర్మించాలని సీపీఎం ఓల్డ్‌సిటీ కార్యదర్శి ఎం.రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం జొహరాపురం రోడ్డు సమీపంలో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రహదారి నిర్మాణం కోసం ఏళ్లుగా పోరాటం చేస్తున్నా ఎందుకు నిర్మించడం లేదని ప్రశ్నించారు. రోడ్డు బాగా లేకపోవడంతో ఎంతో మంది ప్రమాదాల బారిన పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు విజయ రామాంజనేయులు, మహ్మద్, రంగస్వామి, నాగరాజు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

కల్లూరు: అశ్విని ఆస్పత్రి నూతన భవనం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా కల్లూరు అర్బన్ 28వ వార్డు లక్ష్మీపురం గ్రామంలో డాక్టర్ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ బి.ప్రమీల ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. శిబిరంలో ఉచితంగా రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ స్క్రీనింగ్, ఆస్తమా, శ్వాస కోశ సంబంధిత రోగాలకు, ఎముకల సాంద్రత, హిమోగ్లోబిన్ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఆస్పత్రి వైద్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాలికలకు కరాటే సాధన అవసరం



బాలబాలికలకు సర్టిఫికెట్లు అందిస్తున్న డాక్టర్ శంకర్ శర్మ

కర్నూలు (టౌన్): ప్రస్తుత సమాజంలో బాలికలకు చిన్ననాటి నుంచే మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ అవసరమని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. ఆదివారం స్థానిక సంకల్‌బాగ్‌లోని చిన్మయ విద్య మిషన్‌లో.. కోయంబత్తూరులో జరిగిన పోటీల్లో ప్రతిభ చాటి సర్టిఫికెట్లు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ పూర్తయ్యే వరకు విద్యాసంస్థల్లో బాలికలకు ఆత్మరక్షణ కోసం కరాటే వంటి క్రీడల్లో తర్ఫీదు ఇవ్వాలన్నారు. ప్రస్తుత సమాజంలో మహిళలకు ఆత్మరక్షణ తప్పనిసరి అన్నారు. కరాటే వంటి క్రీడల వల్ల ఏకాగ్రత, శారీరక, మానసిక ఆరోగ్యం దేహదారుఢ్యం కలుగుతుందన్నారు. తన వంతుగా క్రీడల అభివృద్ధికి కృషి చేస్తున్నానన్నారు.


కోలుకోలేక వ్యక్తి మృతి



మృతి చెందిన సోమ శ్రీకాంత్

కర్నూలు (టౌన్): కుటుంబ కలహాలతో యువకుడు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. తిరుపతి దేవస్థానానికి చెందిన బర్డ్స్ ఆసుపత్రిలో సోమ శ్రీకాంత్ (30) గ్యాస్ రూమ్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఆయనకు 9 నెలల క్రితం నంద్యాల జిల్లా పాణ్యం గ్రామానికి చెందిన సుప్రియతో వివాహం అయ్యింది. ఇద్దరికీ మనస్పర్థలు వచ్చి విడిపోయారు. వివాహ బంధం చెడిపోవడంతో జీవితంపై విరక్తి చెందిన శ్రీకాంత్ స్థానిక కల్లూరు ఎస్టేట్‌లో ఉన్న బావ రామాంజనేయులు ఇంటికి వచ్చాడు. తన వెంట తెచ్చుకున్న టాగ్ ప్రాక్స్ పారాక్విట్ పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక ఆదివారం శ్రీకాంత్ మృతి చెందాడు. తండ్రి సోమ తిప్పరెడ్డి ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు నాలుగవ పట్టణ పోలీసులు వెల్లడించారు.

ట్యాంకర్ బోల్తా



కర్నూలు(రూరల్): ట్యాంకర్ డ్రైవర్ నిద్రమత్తులో వాహనం నడపడంతో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తా పడిన ఘటన మండల పరిధిలోని గార్గేయపురం శ్మశాన వాటిక వద్ద ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఆత్మకూరు నుంచి బళ్లారికి సిమెంట్ మిశ్రమంతో వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. ఆ సమయంలో ఇతర వాహనాలు రాక పోవడంతో ప్రమాదం తప్పింది. డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తాలుక అర్బన్ పోలీస్‌స్టేషన్ సీఐ శ్రీధర్ తెలిపారు.

పాలన చేతగాకే అక్రమ అరెస్టులు

- మిథున్ రెడ్డిని అరెస్టు చేయడం ప్రభుత్వ కుట్ర
- సంక్షేమం, అభివృద్ధిని గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వం
- 13 నెలల చంద్రబాబు పాలన అట్టర్ ఫ్లాప్
- కర్నూలు మాజీ ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు (టౌన్): పాలన చేతగాకే రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ నేతలపై, కార్యకర్తలపై ప్రభుత్వం అక్రమంగా కేసులు నమోదు చేస్తోందని కర్నూలు మాజీ ఎమ్మెల్యే, పీఏసీ సభ్యుడు హాఫీజ్ ఖాన్ ధ్వజమెత్తారు. రాష్ట్రంలో మంత్రిగా పనిచేయకపోయినా కేవలం వైఎస్ జగన్‌కు అండగా ఉన్నాడన్న అక్కసుతో సంబంధం లేని లిక్కర్ కేసులో పార్లమెంటు సభ్యుడు మిథున్ రెడ్డిని అరెస్టు చేయడం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. ఆదివారం మాజీ ఎమ్మెల్యే తన స్వగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. లిక్కర్ వ్యవహారంలో ముందు రూ.50 వేల కోట్ల అవినీతి జరిగిందన్నారు. ఇప్పుడు రూ.2 వేల కోట్లు అంటున్నారన్నారు. ఈ ప్రభుత్వానికే క్లారిటీ లేదు. ఎక్కడైన డబ్బును సీజ్ చేశారా? అని ప్రశ్నించారు. కేవలం ఇద్దరు, ముగ్గురు ఉద్యోగులను టార్గెట్ చేసుకొని బెదిరించి వారి మాటలను వాంగ్మూలంగా చూపించి వైఎస్సార్‌సీపీలో బలంగా ఉన్న నాయకులపై ఈ ప్రభుత్వం అక్రమంగా కేసులు నమోదు చేస్తోందన్నారు. ముందుగా ఏదో ఒక స్కామ్ అంటూ ఎల్లో మీడియా ద్వారా ప్రచారం చేయడం, కీలకమైన వ్యక్తులు అంటూ రాయించడం, చివరకు వైఎస్సార్‌సీపీ నాయకులను అరెస్టు చేయడం జరుగుతుందన్నారు. ఇదంతా సీఎం చంద్రబాబు ప్రోద్బలంతో ఎల్లో మీడియా చేస్తున్న కుట్ర అని విమర్శించారు. కుట్రలు చేయడం, రాజకీయంగా కక్ష సాధించడం చంద్రబాబుకు అలవాటే అన్నారు. 2014 – 2019 మధ్య కాలంలో చంద్రబాబుపై లిక్కర్ కుంభకోణం కేసులు ఉన్నాయని, ఆయన చేసినవన్నీ సక్రమమే అని డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రాష్ట్రంలో లిక్కర్ అక్రమాలు ఎందుకు నిరోధించడం లేదని ప్రశ్నించారు. మద్యంను ఎమ్మార్పీ కంటే అధిక ధరకు అమ్ముతున్నారని. రేషన్ డోర్ డెలివరీ లేదని, మద్యం మాత్రం ఇంటికి పంపుతున్నారని, సిండికేట్ వ్యాపారం, విచ్చల విడిగా బెల్టు షాపులతో మద్యం ఏరులై పారుతోందని ధ్వజమెత్తారు.

సూపర్ సిక్స్ పథకాలు ఏవీ?

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కన్నా ఎక్కువగా ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందిస్తామని చెప్పిన చంద్రబాబు ఏడాదిపాలన దాటినా సూపర్ సిక్స్ హామీలు ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. అన్నదాత సుఖీభవ పేరుతో రైతులకు ఏడాదికి రూ.20 వేలు, మహిళలకు నెలకు రూ.1500, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు 50 ఏళ్లకే పింఛన్, నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు భృతి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఎప్పుడిస్తారని నిలదీశారు. నాడు జగనన్న విద్య, వైద్యానికి పెద్ద పీట వేస్తే.. ఈ ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. కేసులతో భయపెట్టాలని చూస్తే వెనకడుగు వేసేది లేదని, ప్రజల పక్షాన ప్రభుత్వ నిరంకుశ పాలనను నిలదీస్తామని స్పష్టం చేశారు. పార్టీ నాయకులు నయీం బాషా, ఆదిమోహన్ రెడ్డి, ఆసిఫ్, మధుసూదన్ రెడ్డి, ఫరూఖ్ బాషా పాల్గొన్నారు.

దౌర్జన్యాలు చేస్తే ఓట్లు రాలవు

ప్రశాంతతకు మారుపేరైన కర్నూలులో మంత్రి అనుచరుల ఆగడాలు శృతి మించుతున్నాయని మాజీ హాఫీజ్‌ఖాన్ మండిపడ్డారు. వాటిని నిలువరించకుంటే మంత్రి గారే దాడులను ప్రోత్సహిస్తున్నారన్న విమర్శలకు బలం చేకూరుతుందన్నారు. రెండు రోజుల క్రితం టీడీపీ గూండాల దాడిలో ధ్వంసమైన.. 10వ వార్డు కార్పొరేటర్ షేక్ యూనూసు బాషాకు చెందిన వైఎస్సార్‌సీపీ వార్డు కార్యాలయాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం దౌర్జన్యాలు, దాడులు, అక్రమ కేసులు తప్పా అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు మాత్రం లేదన్నారు. కర్నూలు ఎమ్మెల్యేకు మంత్రి పదవి రావడంతో నగరం అభివృద్ధి చెందుతుందని ఆశించారని, అయితే మంత్రి అనుచరులు డబ్బులు వసూలు చేయడం, దౌర్జన్యాలు చేయడం అలవాటు చేసుకున్నారన్నారు. 13 నెలల పాలనలో ఒక్కటైనా అభివృద్ధి పని చేశారా? అని ప్రశ్నించారు. వార్డులో ఆదరణ ఉన్న షేక్ యూనుసు బాషాను టార్గెట్ చేసి గతంలో ఎస్సీ, ఎస్టీ కేసు, ఇప్పుడు హత్యాయత్నం కేసు నమోదు చేశారన్నారు. టీడీపీ వారు రాత్రి దౌర్జన్యం చేసి, పొద్దున్నే తమపై దాడి జరిగిందని కేసు పెట్టడం, పోలీసులు నమోదు చేయడం ఆ శాఖ పరితీరుకు నిదర్శనమన్నారు. మంత్రి టీజీ భరత్ టీడీపీ గుండాల అరాచకాలను నిలువరించాలన్నారు. వచ్చే కార్పొరేషన్ ఎన్నికల్లో ఏ ముఖం పెట్టుకొని వార్డుల్లో తిరుగుతారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

లిక్కర్ స్కామ్ సూత్రధారి చంద్రబాబే



వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుభాష్ చంద్రబోస్

కర్నూలు (టౌన్): లిక్కర్ స్కామ్ పేరుతో కూటమి ప్రభుత్వం చేస్తున్న కుట్రకు కథ, డైరెక్షన్ అంతా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడే అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దూరు సుభాష్ చంద్రబోస్ అన్నారు. ఆదివారం స్థానిక సీ.క్యాంపులోని కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీలో క్రియా శీలకంగా పనిచేస్తున్న నాయకులను తప్పుడు కేసులతో వేధించడంలో భాగంగానే పార్లమెంటు సభ్యుడు మిథున్ రెడ్డిని అక్రమంగా అరెస్టు చేశారన్నారు. లిక్కర్ స్కామ్ కేసులో సహాయకారిగా విజయసాయి రెడ్డి వ్యవహరిస్తున్నారన్నారు. అధికార మదంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై తప్పుడు కేసులు సృష్టించి వేధించాలని కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. తప్పుడు కేసులకు వైఎస్సార్‌సీపీ భయపడదన్నారు.

జేసీ ప్రభాకర్ రెడ్డిని అరెస్టు చేయాలి

జిల్లా పంచాయతీ అధికారి బోయ నాగరాజు నాయుడును కించపరుస్తూ తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు దుర్మార్గమని, ఆయన్ను వెంటనే అరెస్టు చేయాలని మద్దూరు సుభాష్ చంద్రబోస్ డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు వాల్మీకుల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా జేసీ ప్రభాకర్ రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలన్నారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా వాల్మీకులను సమీకరించి తాడిపత్రి పోలీసు స్టేషన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.

మోసం చంద్రబాబు నైజం

- హామీలు అమలు చేయకుండా అన్ని వర్గాలను వంచించిన ప్రభుత్వం
- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి విమర్శలు
- 19వ వార్డులో బాబూ ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం



సీఎం చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరిస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మేయర్ బీవై రామయ్య

కల్లూరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు ఎలాంటి సంక్షేమ పథకాలు అందడం లేదని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం కల్లూరు అర్బన్ 19వ వార్డు గణేష్ నగర్, నాల్గవ తరగతి ఉద్యోగుల కాలనీలో కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మేయర్ బీవై రామయ్య, పార్టీ నాయకులతో కలిసి 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వంచన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాటసాని ఇంటింటికీ తిరుగుతూ.. ఏడాది కాలంలో వివిధ సంక్షేమ పథకాలు అందక ప్రతి కుటుంబం ఎంత మోసపోయిందో వివరించారు. కాలనీలో ఎవరిని పలకరించినా సంక్షేమ పథకాలు అందడం లేదని, ప్రతిదాంట్లో కోతలు పెట్టి పథకాలు కొందరికే ఇస్తున్నారని ప్రజలు నాయకుల ముందు గోడు వెళ్లబోసుకున్నారు. కాటసాని మాట్లాడుతూ.. చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలు తెలుసుకున్నారన్నారు. కాలనీలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన క్యూఆర్ కోడ్‌ను ప్రజలతో స్కాన్ చేయించారు. ఏడాది కాలంలో సంక్షేమ పథకాలు అందకపోవడం వల్ల ఎంత నష్టపోయారో వివరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి జగనన్న కులవృత్తులకు, పొదుపు సంఘాల మహిళలకు, వైఎస్సార్ చేయూత, ఆసరా పథకాలు అందించి సంక్షేమ సారథిగా నిలిచారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించిన ఉచిత ఇసుక ఎక్కడా అమలు కావడం లేదని, ట్రాక్టర్ ఇసుక కోసం రూ.3500 చెల్లించాల్సి వస్తుందన్నారు.

రోడ్లు అధ్వానం

నాల్గవ తరగతి ఉద్యోగుల కాలనీలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని కాటసాని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామీణ, అర్బన్ ప్రాంతాల్లో రోడ్లు వేస్తామని చెప్పారని గుర్తు చేశారు. 14 నెలలు అవుతున్నా కాలనీల్లో రోడ్ల సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. రోడ్డుపై నీళ్లు నిలవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రంలో పోలీసు, రెవెన్యూ వ్యవస్థలను కూటమి నాయకులు నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి అలాంటి వారిపై చర్యలు తీసుకోవడం లేదన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులను భయభ్రాంతులకు గురిచేసేలా కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారన్నారు. అక్రమ కేసులకు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులకు పనులు చేయవద్దని కూటమి నాయకులు అధికారులను ఆదేశిస్తున్నారని విమర్శించారు. బాబు అంటే గుర్తుకొచ్చేవి వెన్నుపోటు, మోసం, అబద్ధాలు అని మేయర్ రామయ్య అన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. పలువురు కార్పొరేటర్లు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో పదవులు పొందిన నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా ఇంకెప్పుడు?



వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి పర్వత రెడ్డి శ్రీనివాసరెడ్డి

కర్నూలు (టౌన్): జిల్లాలో రైతుల పరిస్థితి అధ్వానంగా తయారైందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు అన్నదాత సుఖీభవ పేరుతో రూ.20 వేలు వెంటనే మంజూరు చేయాలని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి పర్వతరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. లేని పక్షంలో జిల్లావ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో రైతులతో కలిసి ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు. ఇటీవల జిల్లాలో పర్యటించిన ముఖ్యమంత్రి చంద్రబాబు హంద్రీ – నీవా సుజల స్రవంతి ప్రాజెక్టును తానే నిర్మించానని చెప్పుకోవడం హాస్యాస్పదమన్నారు. మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి హయంలోనే హంద్రీ – నీవా, ముచ్చుమర్రి, లింగాల పథకాలు, జలయజ్ఞం పేరుతో రైతుల కలలు నేరవేర్చారని గుర్తు చేశారు. గతేడాది ఎన్నికల ముందు గుండ్రేవుల, చిత్రావతి ప్రాజెక్టులను నిర్మిస్తామని పదే పదే చెప్పిన చంద్రబాబు ఏడాది దాటినా ఆ ప్రాజెక్టులపై నోరు మెదపడం లేదని విమర్శించారు. రైతు భరోసా ఏడాదికి రూ.20 వేలు, మహిళలకు నెలకు రూ.1500, నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు, ఏటా నాలుగు లక్షల ఉద్యోగాల హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. నమ్మించి మోసం చేసిన చంద్రబాబుకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు.

స్మార్ట్‌మీటర్లు పెడితే బుద్ధి చెబుతాం



మాట్లాడుతున్న పి.నిర్మల

కర్నూలు(సెంట్రల్): పేదల ఇళ్లకు స్మార్ట్ మీటర్లను పెడితే కూటమి ప్రభుత్వానికి సమాధి కడతామని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు పి.నిర్మల హెచ్చరించారు. ఆదివారం కార్మిక, కర్షక భవన్‌లో సీపీఎం కర్నూలు న్యూసిటీ, ఓల్డ్‌సిటీ కమిటీల విస్తృత స్థాయి సమావేశాలను జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నరసింహులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల ముందు స్మార్ట్ మీటర్లను ఎట్టి పరిస్థితుల్లో ఒప్పుకోమని చెప్పిన చంద్రబాబునాయుడు అధికారంలోకి రాగానే గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం అన్యాయమన్నారు. మరోవైపు స్మార్ట్ మీటర్లను బిగిస్తే పగలగొట్టండన్న మంత్రి లోకేష్ ఇప్పుడు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. కేవలం ఓట్ల కోసం దొంగ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమికి భంగపాటు తప్పదని, ఇచ్చిన హామీ మేరకు స్మార్ట్ మీటర్లను విరమించుకోవాలని సూచించారు. మరోవైపు కూటమి ప్రభుత్వం ఏడాదిలోపే ప్రజలపై రూ.15 వేల కోట్ల విద్యుత్ చార్జీల భారం మోపిందని విమర్శించారు. ప్రజలపై ఇంధన లోడ్ సమస్యతో వేయనున్న అదనపు భారాలను తగ్గించాలని డిమాండ్ చేశారు. లేదంటే సీపీఎం ఆధ్వర్యంలో సమరశీల పోరాటాలకు సిద్ధమవుతామని స్పష్టం చేశారు. నగర కార్యదర్శులు ఎం.రాజశేఖర్, టి.రాముడు పాల్గొన్నారు.

స్మార్ట్‌మీటర్ల భారం పేదలపైనే..

మరోవైపు స్మార్ట్‌మీటర్లను బిగిస్తే ఆ భారం పేదలైన దళితులు, బీసీలపైనే పడుతుందని కేవీపీఎస్ జిల్లా గౌరవాధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం కేవీపీఎస్ నగర అధ్యక్షుడు జి.యేసు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దళితులపై జరుగుతున్న దాడులు, నేరాలను అరికట్టడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. నాయకులు ఆర్.నరసింహులు, ఎం.భాస్కర్ పాల్గొన్నారు.

రసాయన ఎరువులు అతిగా వాడొద్దు



మాట్లాడుతున్న నంద్యాల ఆర్ఏఆర్ఎస్ కీటక శాస్త్రవేత్త రామకృష్ణారావు

కర్నూలు(అగ్రికల్చర్): రసాయన ఎరువులు ప్రధానంగా నత్రజని, భాస్వరం ఎరువులు మోతాదుకు మించి వాడటం వల్ల సూక్ష్మదాతు లోపాలు ఏర్పడుతాయని, తద్వారా పంట దిగుబడులు తగ్గుతాయని నంద్యాల ఆర్ఏఆర్ఎస్ కీటక శాస్త్రవేత్త రామకృష్ణారావు తెలిపారు. ఆదివారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సెమినార్ హాల్‌లో ఇన్‌పుట్ డీలర్లకు దేశీ డిప్లొమా కోర్సు కింద నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వివిధ పంటల్లో సూక్ష్మదాతు లోపాలు, వాటి లక్షణాలు.. నివారణ పద్ధతులపై అవగాహన కల్పించారు. భాస్వరం ఎరువును భూమిలో ఆఖరు దుక్కిలో మాత్రమే వేయాలి. నత్రజని ఎరువులు ఎక్కువగా వేయడం వల్ల పంటల్లో రోగనిరోధక శక్తి తగ్గుతుందని తెలిపారు. ఇందువల్ల సూక్ష్మదాతు లోపాలతో పాటు చీడపీడల సమస్యలు పెరుగుతాయని, సాగు ఖర్చు పెరుగుతుందన్నారు. ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ రత్నప్రసాద్ మాట్లాడుతూ.. వ్యవసాయ పరిజ్ఞానాన్ని పెంచుకునేందుకు దేశీ శిక్షణా కార్యక్రమం ఇన్‌పుట్ డీలర్లకు చక్కటి అవకాశం అన్నారు. విశ్రాంత జేడీఏ, దేశీ కార్యక్రమ సమన్వయకర్త జయచంద్ర, వివిధ మండలాలకు చెందిన ఇన్‌పుట్ డీలర్లు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(సెంట్రల్): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలు ఉన్న ప్రజలు వినతులను సమర్పించవచ్చని సూచించారు.అలాగే కలెక్టరేట్‌తోపాటు అన్ని మండల, డివిజనల్, మునిసిపల్ కార్యాలయాల్లోనూ అధికారులు అందుబాటులో ఉండి ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తారని ఆయన వివరించారు.

అర్జీల సమాచారం కోసం 1100 ఫోన్ నంబర్

అర్జీదారులు తమ దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవడం కోసం కాల్ సెంటర్ నంబర్ 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అలాగే అర్జీదారులు meekosam.ap.gov.in అనే వెబ్‌సైట్‌లో కూడా అర్జీలను నమోదు చేసుకోవడానికి అవకాశం కల్పించినట్లు తెలిపారు.

నగరపాలక సంస్థలో..

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిషనర్ పి. విశ్వనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలకలోని అన్ని విభాగాల అధికారులు పాల్గొంటారని, నగర పరిధిలోని ప్రజలకు తమ కాలనీల్లో ఏవైనా సమస్యలు ఉంటే లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

నగరంలో మోస్తరు వర్షం

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు నగరంలో ఆదివారం రాత్రి ఓ మోస్తరు వర్షం కురిసింది. రాత్రి 9.25 గంటల నుంచి 20 నిముషాల పాటు వర్షం కురవడంతో రహదారులు జలమయం అయ్యాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం వల్ల కర్నూలుతో పాటు వివిధ మండలాల్లో వర్షాలు కురిశాయి. ఉదయం నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నాయి. సాయంత్రం నుంచి వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని పలుచోట్ల వర్షాలు కురిశాయి. ఈదురుగాలులు కూడ వీచాయి.

స్విమ్మింగ్‌లో జిల్లాకు పతకాలు



పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న డీఎస్ఏ స్విమ్మింగ్ కోచ్ నటరాజ్

కర్నూలు (టౌన్): విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఈనెల 19, 20 తేదీల్లో నిర్వహించిన 10వ ఏపీ సబ్ జూనియర్, జూనియర్ అంతర్ జిల్లాల స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో కర్నూలు ఈత క్రీడాకారులు పతకాలు సాధించారు. గ్రూపు –1 బాలుర విభాగంలో 200 మీటర్లు, 100 మీటర్ల ఫ్రీస్టైల్‌లో, 50 మీటర్ల బ్యాక్ స్ట్రోక్‌లో వై.దేవశృత్ సాయి మూడు వెండి పతకాలు, బాలికల విభాగంలో 200 మీటర్లు, 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో, 100 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్‌లో హేమలత మూడు వెండి పతకాలు, గ్రూపు–2 బాలికల విభాగంలో కురువ శృతి 200 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్, 800 మీటర్ల ఫ్రీస్టైల్‌లో రెండు కాంస్య పతకాలు సాధించారు. పతకాలు సాధించిన ఈత క్రీడాకారులను డీఎస్‌డీఓ భూపతిరావు, స్విమ్మింగ్ కోచ్ నటరాజ్ అసోసియేషన్ కార్యదర్శి రామక్రిష్ణ యాదవ్ తదితరులు అభినందించారు.

జన సేవాదళ్ కవాతు



కవాతులో పాల్గొన్న సీపీఐ, అనుబంధ సంఘాల నాయకులు

కర్నూలు(సెంట్రల్): భారత కమ్యూనిస్టు పార్టీ 24వ జిల్లా మహాసభల విజయవంతం కోసం విద్యార్థి, యువజన, మహిళా సంఘాల ఆధ్వర్యంలో జన సేవాదళ్ కవాతు నిర్వహించారు. ఆదివారం దేవనగర్ రైల్వే గేటు వద్ద ఉన్న గుడ్ షెఫర్డ్ స్కూలు నుంచి కలెక్టరేట్ వరకు ఆయా సంఘాల ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పి.రామచంద్రయ్య మాట్లాడుతూ.. భారత కమ్యూనిస్టు పార్టీ కర్నూలు జిల్లా 24వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పేదల కోసం ఆవిర్భావం నుంచి పోరాడిన చరిత్ర సీపీఐ కర్నూలు జిల్లా శాఖకు ఉందని, దాని మహాసభలకు వేలాదిగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు, నాయకులు జగన్నాథం, మునెప్ప పాల్గొన్నారు.

వైద్యరంగంలో అనెస్తీషియా పాత్ర కీలకం



కేక్ కట్ చేస్తున్న అనెస్తీషియా హెచ్ఓడీ డాక్టర్ విశాల, ప్రొఫెసర్ రామశివనాయక్ తదితరులు

కర్నూలు(హాస్పిటల్): అత్యవసర వైద్యంలో వెంటిలేటర్‌పై ఉన్న రోగులకు అనెస్తీషియా టెక్నీషియన్లు కీలక పాత్ర వహించి వైద్యం చేస్తారని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల అనెస్తీషియా హెచ్ఓడీ డాక్టర్ విశాల చెప్పారు. ఆదివారం ఆసుపత్రిలోని అనెస్తీషియా విభాగంలో జాతీయ అనెస్తీషియా, ఆపరేషన్ థియేటర్ టెక్నాలజిస్టు డే సందర్భంగా కేక్ కట్ చేశారు. డాక్టర్ విశాల మాట్లాడుతూ.. అనెస్తీషియా టెక్నాలజిస్టులు.. వెంటిలేటర్‌పై ఉన్న రోగులకు ఎండోట్రాకియల్ ట్యూబ్ ద్వారా శ్వాస అందించడంలో, ట్యూబ్ బ్లాకింగ్ నివారణలో, ప్రతి రెండు గంటలకు రోగుల పొజిషన్ మార్చడంలో, రైల్స్ ట్యూబ్ ఫీడింగ్, చెస్ట్ ఫిజియోథెరపీ, ఐవీ ఇంజెక్షన్లు వంటి అంశాల్లో కీలక సేవలందిస్తున్నారని చెప్పారు. ముఖ్యంగా సెంట్రల్ లైన్ ఇన్‌ఫెక్షన్ల నివారణలో వారికి మంచి అవగాహన ఉంటుందన్నారు. రోగులు త్వరితగతిన కోలుకోవడంలో, ఇన్‌ఫెక్షన్లు నివారించి ప్రాణాలను రక్షించడంలో విశేష సహకారం అందిస్తున్నారన్నారు. ప్రొఫెసర్ డాక్టర్ రామ శివనాయక్ మాట్లాడుతూ.. అనెస్తీషియా టెక్నీషియన్లు ఐసీయూ, ఎమర్జెన్సీ విభాగాల్లో అత్యంత కీలకంగా పనిచేస్తున్నారని చెప్పారు. రాబోయే రోజుల్లో ఇంకా మంచి సేవలతో రోగులకు సేవలందించాలన్నారు. ప్రభుత్వం వీరి సేవల ప్రాధాన్యతను గుర్తించి పోస్టుల సంఖ్యను పెంచాలన్నారు. అనెస్తీషియా అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బాలసారయ్య, టెక్నీషియన్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్.దినేష్, టెక్నాలజిస్టులు విజయ్, కుమారి, రేణుక, రాధ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలి

కర్నూలు (న్యూటౌన్): నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని, అలాగే చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ హెచ్చరించారు. ఆదివారం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసులు ఆయా పోలీస్ స్టేషన్లలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. నేర చరిత్ర కలిగిన వారికి, చెడు ప్రవర్తన కలిగిన వ్యక్తులకు కౌన్సెలింగ్ చేశారు. ఎస్పీ మాట్లాడుతూ.. సత్ప్రవర్తతో జీవించాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి



జెండావిష్కరించిన ఆటో యూనియన్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): ఆటో డ్రైవర్లకు నష్టదాయకమైన ఓలా, ఉబర్, రాపిడో వంటి యాప్‌లను రద్దు చేయాలని ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్, న్యూసిటీ కార్యదర్శి బి.రాధాకృష్ణ, ఆటో యూనియన్ అధ్యక్షుడు హుస్సేన్‌వలి డిమాండ్ చేశారు. ఆదివారం అంబేడ్కర్ నగర్‌కు చెందిన 40 మంది ఆటో కార్మికులు సీఐటీయూలో చేరారు. వారికి యూనియన్ నాయకులు స్వాగతం పలికి కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం అక్కడ ఆటో స్టాండ్‌ను ఏర్పాటు చేసుకోగా..జెండాను ఆవిష్కరించారు. అనంతరం అంబేడ్కర్ ఏరియా నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా రాముడు, అధ్యక్షులుగా నరేంద్రగౌడ్, ఉపాధ్యక్షులుగా అండ్రియ్య, సుధాకర్, శరత్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.రాజా, సహాయ కార్యదర్శులుగా బాబు, సామేలు, కోశాధికారిగా తిరుమలరావుతో పాటు పలువురిని కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.